మన్యంలో ఎగిరొస్తున్న డ్రోన్లు

- ప్రభుత్వ చొరవతో జిల్లాలో పెరిగిన వినియోగం
- రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖల్లో కీలకంగా మారిన వైనం



6లో

ఆలస్యంగా చెల్లిస్తే అంతేనా?

- స్మార్ట్ మీటర్ల పనితీరుపై అసంతృప్తి
- బిల్లు తేదీ దాటితే ఆటోమేటిక్‌గా సరఫరా నిలిపివేత
- చేతులెత్తేస్తున్న విద్యుత్ సిబ్బంది
- ఎన్నిరోజులైనా.. ప్రత్యేక నిపుణుడు వచ్చేవరకూ వేచి ఉండాల్సిందే..
- అంతవరకు కరెంట్ పునరుద్ధరణ జరగని వైనం
- తలలు పట్టుకుంటున్న వినియోగదారులు



సీతంపేట రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వినియోగిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. అనుకున్న సమయానికి బిల్లు చెల్లించక పోయినా.. లేట్‌గా చెల్లించినా.. రెండు, మూడు నెలల నుంచి కట్టకపోయినా వెంటనే ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది. అయితే ఇది మామూలే కదా అని అనుకోవచ్చు. అయితే సదరు వినియోగదారులు హంటాహంటిన ఫైన్‌తో బిల్లులు చెల్లిస్తున్నా.. వెనువెంటనే విద్యుత్ పునరుద్ధరణ జరగడం లేదు. దీనిపై ఆ శాఖాధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో 'స్మార్ట్' వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

● గత ఏడాది మన్యంలోని వ్యాపార, గృహ, ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ స్మార్ట్‌మీటర్లను బిగించారు. వినియోగదారులకు ఇష్టం లేకపోయినప్పటికీ బలవంతంగా మొదటివిడతలో మండలంలో సుమారు 1500వరకు ఏర్పాటు చేశారు. ఇక సీతంపేటలో ప్రయోగాత్మకంగా 380 సర్వీసులకు ఈ మీటర్లు బిగించారు. అయితే విద్యుత్ బిల్లు ఎంత వస్తుందో తెలియక వినియోగదారులు తికమకపడుతున్నారు. గతంలో ప్రతి నెలా విద్యుత్ బిల్లులు తమ చేతికి వచ్చేవని, ఇప్పుడు ఎంత విద్యుత్ వినియోగిస్తున్నామో తెలియడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా విద్యుత్ బిల్లులు ఎక్కువ మొత్తంలో వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సాధారణంగా విద్యుత్ బిల్లు అనుకున్న సమయానికి చెల్లించకపోతే ఫైన్‌తో చెల్లింపులు చెల్లించాల్సి ఉంటుంది. అలాకాకపోతే విద్యుత్ సిబ్బంది సదరు వినియోగదారుల ఇళ్లకు వెళ్లి సరఫరా నిలుపుదల చేస్తామని హెచ్చరిస్తుంటారు. మొండి బకాయిదారుల ఇళ్లకైతే కరెంట్‌ను కట్ చేస్తారు. బిల్లులు చెల్లించిన తరువాత వెంటనే విద్యుత్‌ను సరఫరాను పునరుద్ధరిస్తారు. అయితే స్మార్ట్‌మీటర్‌లను వినియోగిస్తున్న వినియోగదారుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆలస్యంగా విద్యుత్ బిల్లు చెల్లిస్తే.. ఆటోమేట్‌గా సరఫరా నిలిచిపోతుంది. తిరిగి ఎప్పుడు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ అవుతుందో ఎవరికీ తెలియదు. సుమారు మూడు రోజుల తర్వాత శ్రీకాకుళం నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ నిపుణుడు అప్‌డేషన్ చేశాక సీతంపేటలో పలువురు వినియోగదారుల ఇళ్లకు విద్యుత్ పునరుద్ధరణ జరిగింది. కాగా మారుమూల గ్రామాల్లో సిగ్నల్ వ్యవస్థ అందుబాటులో లేని చోట ఇంకెన్ని రోజులకు సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.



మూడు రోజుల తర్వాత సీతంపేట వచ్చి సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్న నిపుణుడు

బిల్లు మొత్తం కట్టినా..

సీతంపేట గ్రామానికి చెందిన ఓ వినియోగదారుడు మూడు నెలల కిందట తమ ఇంటికి సూర్యఘర్ పథకం కింద సోలార్‌ప్యానెల్ సిస్టంను ఏర్పాటు చేసుకున్నారు. అప్పుడే కేటగిరీ -2కింద విద్యుత్ సిబ్బంది ఈ స్మార్ట్‌మీటర్‌ను బిగించారు. అయితే బిల్లు చెల్లించలేదనే కారణంతో ఇటీవల విద్యుత్ నిలిచిపోయింది. దీంతో మూడు నెలల బిల్లు రూ.8200 ఆన్‌లైన్‌లో ఒక్కసారిగా చెల్లించారు. అయినప్పటికీ ఇంతవరకు విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. దీనిపై స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లి సిబ్బందిని

(మిగతా 8వ పేజీలో...)



సీతంపేటలో ఓ దుకాణంలో ఉన్న స్మార్ట్‌మీటర్

కూటమి ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

- అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు

కురుపాం సమీపంలో ఏనుగుల గుంపు



6లో

తల్లిపాలే అమృతం

- బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం ● అమ్మకూ వ్యాధులు దూరం

సాలూరు రూరల్/జియ్యమ్మవలస, జూలై31(ఆంధ్రజ్యోతి): బిడ్డ భూమి మీద పడగానే బిడ్డకు తల్లి అందించే అమృతం ముర్రుపాలు. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. అయితే నేటి ఆధునిక సమాజంలో నెలకొన్న అనేక అపోహల వల్ల ఎంతోమంది బిడ్డలకు పాలివ్వకుండా వారి అనారోగ్యానికి కారణమవుతున్నారు. తల్లులు కూడా పలు వ్యాధులకు గురవుతున్నారు. అందుకే తల్లిపాల ఆవశ్యకతను చాటి చెప్పేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. బిడ్డకు తొలి పోషణ, రక్షణ ఇచ్చేవి తల్లిపాలే. పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వాలి. 'బిడ్డకు తల్లి కూర్చొని పాలు పెట్టాలి. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలి. దీనిలో కొలస్ట్రమ్ ఉంటుంది. దీని వల్ల బిడ్డకు వ్యాధినిరోధక శక్తి లభిస్తుంది. బిడ్డకు కూర్చొని పాలిచ్చి వెంటనే భుజంపై వేసుకొని వీపు నిమిరాలి. పాలిచ్చిన వెంటనే మంచంపై వేయకూడదు. ఆపరేషన్ చేసిన ముర్రు పాలు వస్తాయి. ప్రతి తల్లి బిడ్డకు తప్పకుండా పాలు ఇవ్వాలి.' అని సాలూరు నియోజకవర్గ వైద్యశాఖ ప్రోగ్రామింగ్ అధికారి డి.శివకుమార్ తెలిపారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో భద్రగిరి, కురుపాం, కొమరాడ, పార్వతీపురం, పాచిపెంట, భామిని, బలిజిపేట, పాలకొండ, సాలూరు, సీతంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,436 మెయిన్, 639 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 60,166 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో పాలు ఇచ్చే తల్లులు 3,177 మంది, గర్భిణులు 4,305 మంది, 0-6 నెలల వయస్సు ఉన్న పిల్లలు 2,712 మంది, 6 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలు 22,007 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల మధ్యనున్న పిల్లలు 20,331 మంది, కౌమార బాలికలు 7,634 మంది ఉన్నారు. వీరందరికీ ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాలు ప్రాముఖ్యతను వివరిస్తారు.



నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ప్రత్యేక కథనం 6లో

ప్రజలు తిరస్కరించినా బుద్ధి రాలేదు

- మంత్రి సంధ్యారాణి

8లో

వరుణుడు కరుణించక.. తోటపల్లి నీరందక

- ఇంజన్ల సాయంతో పంటను కాపాడుకుంటున్న అన్నదాతలు



6లో

రేపే అన్నదాత సుఖీభవ

- రైతుల ఖాతాల్లో నిధులు జమ
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబునాయుడు వెల్లడి



పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధులు ఈ నెల 2న రైతుల ఖాతాల్లో జమకానున్నాయని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. పండగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను భాగస్వామం చేయాలి. రాష్ట్రంలో 46.85 లక్షల రైతులను అర్హులుగా గుర్తించాం.. వీరందరికీ అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2 వేలు ఖాతాల్లో జమవుతాయి.' అని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సీఎం ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ , డీఆర్వో హేమత తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

సాలూరు రూరల్: 'జిల్లాలో అర్హులైన రైతులందరికి అన్నదాత సుఖీభవ పథకం అందించడానికి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికి 702 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయలేదు. వీలైనంత వరకు అందరితో ఈకేవైసీ చేయిస్తాం.' అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. కాగా జిల్లాలో 1,19,556 మంది రైతులకు ఈ సాయం అందే అవకాశాలున్నాయి. తొలి విడతగా వారికి రూ.7 వేలు జమ కానుంది. ఈ పథకానికి డీకేటీ, చుక్కల భూములున్న రైతులు, ఆదాయపన్ను చెల్లించే వారు, హౌజ్ హోల్డ్ మ్యాపింగ్‌లో లేనివారు తదితరులు అనర్హులు. వాస్తవంగా ఏటా పీఎం కిసాన్ సాయం జూన్, జూలై నెలల్లో జమ చేసేవారు. ఈ ఏడాది జాప్యం జరిగింది. దీంతో అన్నదాత సుఖీభవ పథకానికి సైతం నిరీక్షించాల్సి వచ్చింది. మొత్తంగా కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలుపుకుని కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలను విడతల వారీగా అందించనుంది.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గురువారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉత్సవాన్ని నిర్వహించాలి. గిరిజన లబ్ధిదారులకు భూమి, ఇళ్ల పట్టాలు, వ్యవసాయ పనిముట్లు, ఇతర ఉపకరణాలు, ఆర్థిక లబ్ధిని చేకూర్చే చెక్కుల పంపిణీ చేయాలి. సాంస్కృతిక, ఆర్చరీ పోటీలను నిర్వహించాలి. శనివారం 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని ప్రారంభించాలి. ఈ విషయాన్ని ముందుగా రైతులకు తెలియజేయాలి.' అన తెలిపారు. సమావేశంలో డీఆర్వో హేమలత, ప్రత్యేక ఉపకలెక్టర్ దిలీప్ చక్రవర్తి, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

నాలుగు ప్రైవేటు క్లినిక్‌ల సీజ్

- అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తింపు
- నిర్వాహకులకు నోటీసులిచ్చిన అధికారులు

భామిని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నాలుగు ప్రైవేట్ క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. వాటి నిర్వాహకులకు నోటీసులు అందించారు. గురువారం రెవెన్యూ, వైద్య సిబ్బంది, పోలీస్ బృందం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సింగిడి, గురండి గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ, బీఎంపీ క్లినిక్‌లు, మందుల షాపులు, ల్యాబ్‌లను పరిశీలించారు. కాగా నాలుగు క్లీనిక్‌లో ఏ ఒక్కరికీ రిజిస్టర్ సర్టిఫికెట్లు లేనట్లు ధ్రువీకరించారు. బీఫార్మసీ సర్టిఫికెట్లు లేకుండా మెడికల్ షాపులు, ల్యాబ్‌లు, మూడు బెడ్‌లతో క్లీనిక్‌లు నడిపిస్తున్నట్లు గుర్తించారు. ఆయా చోట్ల ప్రాథమిక చికిత్స కాకుండా పిల్లలు, పెద్దలకు అన్ని రకాల వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలుసుకున్నారు. నిల్వ ఉన్న ఇంజక్షన్లు, మందులను స్వాధీనం తీసుకొని, నాలుగు క్లీనిక్‌లను సీజ్ చేశారు. ఈ సమాచారాన్ని జిల్లా అధికారులకు అందించామని తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ తెలిపారు.



సింగిడి క్లినిక్ నిర్వాహకులకు నోటీసులు అందిస్తున్న దృశ్యం

నేడు పింఛన్ల పంపిణీ

పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను నేడు జిల్లావ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తారని పేర్కొన్నారు. మొదటిరోజునే శతశాతం పింఛన్లు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.మండల ప్రత్యేకాధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి నివేదికను అందించాలని సూచించారు. జిల్లాలోని 1,40,672 మందికి రూ.60.10 కోట్లును పింఛన్ల రూపంలో అందజేస్తున్నట్లు వివరించారు.



వితంతువులకు ఊరట

గరుగుబిల్లి: 'జిల్లాలో 1,634 మంది వితంతువులకు స్పౌజ్ కేటగిరీలో ఈ నెల నుంచి పింఛన్లు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి 427, కురుపాంలో 458, సాలూరులో 302, పాలకొండలో 447 వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. వారితో పాటు గతంలో మంజూరైన పలు రకాల పింఛన్‌దారులకు నిధులు విడుదలయ్యాయి. నిర్ణీత సమయంలో పింఛన్లు అందిస్తాం. నిబంధనలు పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవు.' అని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తెలిపారు.

సేవలు సరే.. మరి స్కానింగో?

- జిల్లాలో పలు ఆసుపత్రులకు రేడియాలజిస్ట్‌ల కొరత ● కొన్నిచోట్ల ప్రత్యేక వైద్య నిపుణులూ లేని వైనం
- రోగులకు తప్పని ఇబ్బందులు ● ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం



పార్వతీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వాసుపత్రులకు రేడియాలజిస్ట్‌ల కొరత వేధిస్తోంది. దీంతో రోగులు స్కానింగ్‌ల కోసం పరుగులు పెట్టాల్సి వస్తోంది. దీర్ఘకాలికంగా ఈ సమస్య వేధిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఆ పోస్టులను భర్తీ చేయాల్సిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో వైద్యులే రేడియాలజిస్ట్‌ల అవతారం ఎత్తాల్సి వస్తోంది. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రితో పాటు సాలూరు ఏరియా ఆసుపత్రిలో రేడియాలజిస్ట్‌లు లేరు. దీంతో గర్భిణులు, ఇతరత్రా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ స్కానింగ్‌సెంటర్లకు అధిక మొత్తంలో చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనుల పరిస్థితి అయితే మరింత దయనీయం. ఆర్థిక భారం కారణంగా గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేకపోతున్నారు. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో రూ.1500 వరకూ చెల్లించి స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం జిల్లా కేంద్రాసుపత్రిలో రోగుల అవస్థలను చూసి వైద్యులే స్కానింగ్ చేస్తున్నారు. ఇక్కడున్న రేడియాలజిస్ట్ జయరాంను సాలూరు బదిలీ చేశారు. అయితే ఆయన అక్కడ విధుల్లో చేరి సెలవుపై వెళ్లిపోయారు. పార్వతీపురం, సాలూరులో ఆయన స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. పాల కొండలో మాత్రం ఇటీవల రేడియాలజిస్ట్ విధుల్లో చేరారు.

వేధిస్తున్న వైద్యుల కొరత

● జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులను నియమించాల్సి ఉంది. ఈ సమస్యను పరిష్కరిస్తామని గతంలో ఈ ప్రాంతంలో పర్యటించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హామీ

(మిగతా 8వ పేజీలో...)



జిల్లాకేంద్రాసుపత్రిలో మూసి ఉన్న స్కానింగ్ గది

తల్లిపాలే అమృతం



- బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం
- అమ్మకూ వ్యాధులు దూరం
- డబ్బా పాలకు దూరంగా ఉండడమే మేలు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

● రాజాంలోని ఓ పిల్లల ఆస్పత్రికి 8 నెలల బిడ్డను తెచ్చింది ఓ మహిళ. నిత్యం విరేచనాలు అవుతున్నాయని ఆమె చెప్పడంతో వైద్యులు పరిశీలించారు. తల్లిపాలు ఇవ్వడం లేదా అని ప్రశ్నించగా.. తాను ఉద్యోగం చేస్తుంటానని.. రోజుకు ఒకసారి మాత్రమే పాలు పెడుతుంటానని చెప్పారు. రోజంతా కుటుంబ సభ్యులే పోత పాలు పడుతుంటారని ఆ మహిళ చెప్పింది. దీంతో చిన్నారికి డయేరియాగా నిర్ధారించిన వైద్యులు విధిగా తల్లిపాలు ఇవ్వాలని కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

● ఇంకో మహిళ పుట్టిన నాటి నుంచి శిశువుకు డబ్బా పాలు పట్టింది. 3 నెలల తరువాత చూస్తే బిడ్డ ఎదుగుదలలో తేడా కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించారు. పుట్టిన సమయంలో 3 కిలోలు ఉన్న బిడ్డ.. 3 నెలల తరువాత కేవలం 3.5 కిలోలే ఉండడాన్ని గుర్తించారు. తల్లి రోజులో ఒకసారి మాత్రమే పాలిచ్చి..మిగతా పూటల్లో డబ్బా పాలు పట్టడం వల్లనే ఎదుగుదల లేదని నిర్ధారించారు. తల్లిపాల ఆవశ్యకత పై అవగాహన కల్పించి పంపించారు.



రాజాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి)

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం. అంతకు మించి బాలింతకు ఆరోగ్యకరం. కానీ ఈ విషయం తెలియని చాలామంది బిడ్డలకు పాలివ్వకుండా వారి అనారోగ్యానికి కారణమవుతున్నారు. తాము సైతం రొమ్ము క్యాన్సర్‌తో పాటు రక్తపోటు, మధుమేహం వంటి వాటికి గురవుతున్నారు. పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్ఠమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కానీ శరీర ఆకృతి మారిపోతుందని.. అందం, ఛాయ తగ్గిపోతుందని చాలా మంది బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం మరుస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. అందుకే తల్లిపాల ఆవశ్యకతను చాటిచెప్పేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.

బిడ్డ పుట్టిన క్షణం నుంచే..

సహజ సిద్ధంగా లభించే తల్లిపాల బదులు డబ్బా పాలు పడుతుండడం పిల్లల భవితకే ముప్పుగా పరిణమిస్తోంది. తల్లి రోజుకు 600 మిల్లీలీటర్ల వరకూ పాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. కనీసం 500 మిల్లీలీటర్ల పాలు ఇస్తే..ఇతరత్రా రూపాల్లో ఆహారం అందించాల్సిన అవసరం లేదు. బిడ్డ పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం ప్రారంభించాలి. అలా రెండేళ్ల వయసు వరకూ ఇవ్వచ్చు. మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలి. తద్వారా అస్తమా, ఎలర్జీ, ఇమ్యూనిటీ లోపం, టీబీ, బ్లడ్‌క్యాన్సర్, డయాబెటిస్, ఎదుగుదల లోపం వంటి రుగ్మతల నుంచి బిడ్డను కాపాడవచ్చు. నవజాత శిశువులకు తల్లిపాలు బదులు పోత పాలు పట్టడంతో వివిధ రుగ్మతల భారిన పడుతున్నారు. ఎదుగుదల లోపం, శ్వాస సంబంధ వ్యాదులు, అస్తమా వంటి వాటికి గురవుతున్నారు. ప్రాథమిక స్థాయిలో తల్లి పాలు ఇవ్వకపోతే ఆ చిన్నారికి జీవితాంతం చాలా రకాల రుగ్మతలు వెంటాడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బిడ్డలకు తల్లిపాలు ఇస్తున్నారు. కానీ పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం చిన్నారులకు తల్లిపాలు అందడం లేదు.

ప్రయోజనాలివే..

ఏ వయసుల వారైనా ఆహార పదార్థాలు ఎంత తాజాగా తీసుకుంటే.. అంత ఆరోగ్యంగా ఉంటారు. పిల్లలకైనా అదే వర్తిస్తుంది. తల్లిపాలు తాగడం వల్ల శిశువులు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదుగుతారు. బిడ్డకు జన్మనిచ్చిన నాలుగు రోజుల వరకూ తల్లి ఉత్పత్తి అయ్యే పాలను ముర్రుపాలు అంటారు. అవి పిల్లలకు ఎలాంటి అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లు సోకకుండా కాపాడతాయి. ఈ పాలు పిల్లల జీర్ణవ్యవస్థకు ఎలాంటి హాని కలగకుండా రక్షిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. తల్లిపాలు తాగి పెరిగిన పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని వివిధ అధ్యయనాలు తేల్చాయి. పిల్లలు బాగా చదవాలన్నా.. భవిష్యత్‌లో అభివృద్ధి సాధించాలన్నా.. పుట్టిన పాపాయికి కొన్ని నెలల పాటు తల్లిపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరం. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. ఈ పాలలో విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్‌లు వంటి ఎన్నో పోషక గుణాలు ఉంటాయి. పాపాయి శరీరానికి అవసరమైన కొవ్వును కూడా అందిస్తాయి. ఇవన్నీ బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడతాయి. తల్లిపాలు సులభంగా జీర్ణం కావడంతో మలబద్ధకం, జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి. ఎదిగే బిడ్డ వయసుకు తగ్గట్టు బరువును ఉంచడంలో కూడా తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయి.

తల్లికీ ఎంతో మేలు..

తల్లి పాలు తాగడం వల్ల పాపాయికే కాదు.. తల్లికి కూడా ఎంతో ఆరోగ్యకరం. దీని వల్ల ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది పాలు పడడానికే కాకుండా గర్భాశయం త్వరగా సంకోచించేందుకు కూడా దోహదపడుతుంది. దీంతో కాన్పు తరువాత రక్తస్రావమూ తగ్గుతుంది. మాతృ మరణాల్లో ఎక్కువగా రక్తస్రావం ఆగకపోవడమే ప్రధాన కారణంగా నిపుణులు చెబుతారు. కాన్పు తరువాత ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటివి పిల్లలకు పాలివ్వడం ద్వారా పూర్తిగా తగ్గుతాయి. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా గర్భిణిగా ఉండే సమయంలో పెరిగిన బరువు కూడా తగ్గుతుంది. పాలిచ్చే క్రమంలో తల్లి శరీరంలో ఉండే క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి. తద్వారా చాలా సులువుగా బరువు తగ్గవచ్చు. పాలు పట్టడం వల్ల తల్లికి మధుమేహం, అధిక రక్తపోటు వంటి వాటి బారినపడే అవకాశం ఉండదని నిపుణులు చెబుతున్నారు. బిడ్డకు పాలిచ్చే మహిళలకు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ ముప్పు చాలా తక్కువని నిపుణులు చెబుతున్నారు. అన్నింటికీ మించి తల్లిపాలు ఇవ్వడం ద్వారా.. పిల్లలకు, తల్లులకు మధ్య అనుబంధం పెరుగుతుంది. అందుకే సమాజంలో ప్రతిఒక్కరూ తల్లిపాల ఆవశ్యకత తెలుసుకొని అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తాం..

తల్లి పాలు సురక్షితం, ఎంతో శ్రేయస్కరం. అందుకే తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి సమాజంలో అవగాహన పెంచే ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,206 ప్రధాన కేంద్రాలు కాగా.. మినీ కేంద్రాలు 293 ఉన్నాయి. వీటి పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి.

-విమలారాణి, ఐసీడీఎస్ పీడీ, విజయనగరం

తల్లిపాలే ఇవ్వాలి..

పుట్టిన నాటి నుంచి పిల్లలకు తల్లి పాలు ఇవ్వడం ప్రారంభించాలి. వారిలో ఎటువంటి రుగ్మతలు దరిచేరకుండా తల్లిపాలు రక్షణ కవచంలా పనిచేస్తాయి. పోత పాలు, డబ్బా పాలు పట్టకుండా ఉండాలి. అలా చేస్తున్న వారు తమ పిల్లల ను అనారోగ్యంలోకి నెడుతున్నారన్న విషయాన్ని గ్రహించాలి. తల్లి పాలు పడితే శరీర ఆకృతి దెబ్బతింటుందన్నది వారి భ్రమ. పాలు పట్టించడం పాపాయితో పాటు తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో శ్రేయస్కరం.

-నీరజ, గైనకాలజిస్టు, రాజాం



ఇంజన్లు పెట్టి పొలాలను తడుపుతున్న రైతులు



ఎండ వేడికి పగుళ్లు ఏర్పడిన పొలాలు

వరుణుడు కరుణించక.. తోటపల్లి నీరందక

● ఇంజన్ల సాయంతో పంటను కాపాడుకుంటున్న అన్నదాతలు

పాలకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరుణుడు పెడముఖం పెట్టడంతో నాట్లు వేసిన పొలాలు ఎండకు పగుళ్లు బారడంతో అవకాశం ఉన్న చోట పాలకొండ ప్రాంతంలో రైతులు ఇంజన్లు పెట్టుకుని పంటను కాపాడుకుంటున్నారన్నారు. జూలై 16న తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు విడిచిపెట్టామని, సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ పాలకొండ పరిధిలో శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందడంలేదు. షట్టర్లు ఏర్పాటు చేయాలని, లస్కర్లను నియమించాలని పలుమార్లు కలెక్టర్, పాలకొండ సబ్ కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను కోరినా ఫలితం లేదని రైతులు అంటున్నారు.

మన్యంలో ఎగిరొస్తున్న డ్రోన్లు

● ప్రభుత్వ చొరవతో జిల్లాలో పెరిగిన వినియోగం ● రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖల్లో కీలకం

● రానున్న రోజుల్లో పెరగనున్న వాటి సంఖ్య ● ఆపరేటర్లుగా యువతకు ఉపాధి అవకాశం

గుమ్మలక్ష్మీపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చొరవతో జిల్లాలో డ్రోన్ల వినియోగం పెరిగింది. ప్రధానంగా పోలీస్, వ్యవసాయ, వైద్య, ఆరోగ్య, రెవెన్యూ, అటవీ శాఖల్లో దానిని విరివిగా వినియోగిస్తున్నారు. వివిధ రకాల పంటలపై క్రిమి సంహారక మందుల పిచికారీ, చెరువుల్లో దోమల లార్వా నివారణ, భూముల రీసర్వే ప్రక్రియ తదితర వాటిని డ్రోన్లతోనే చేపడుతున్నారు. దీనివల్ల తక్కువ వ్యయంతో త్వరగా పనులు పూర్తవుతుండడంతో రానున్న రోజుల్లో డ్రోన్ల వినియోగం మరింత పెరగనుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వాటి నిర్వహణ, మరమ్మతులు చేపట్టేందుకు ఆపరేటర్లుగా పలువురికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు డ్రోన్లు చేరువవుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ శాఖల్లో వాటి వినియోగం పెరగడంతో అతి తక్కువ సమయంలోనే త్వరగా పనులు పూర్తవుతున్నాయి. మన్యంలో వ్యవసాయశాఖకు ప్రభుత్వం 9 డ్రోన్లు అందించగా.. పలుచోట్ల హైరింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న రైతులు ఈ హైరింగ్ సెంటర్లకు వెళ్లి డ్రోన్ తీసుకోవచ్చు. పంట పొలాల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేసుకోవచ్చు. ఈ హైరింగ్ సెంటర్‌లో నిర్వహించే రైతులకు ప్రభుత్వ రాయితీతో రూ.మూడు లక్షల వరకు వ్యవసాయశాఖ రుణ సదుపాయం కల్పిస్తోంది.

● వైద్య ఆరోగ్యశాఖకు ప్రభుత్వం రెండు డ్రోన్లు అందించింది. వాటితో యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపడుతున్నారు. నీటి గుంటలు, చెరువుల్లో దోమలు లార్వా నివారణకు డ్రోన్ల ద్వారా క్రిమి సంహారక మందుల పిచికారీ చేస్తున్నారు. కాగా డ్రోన్ల సాయంతో మలేరియా నివారణ చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.

● శాంతి భద్రతల పరిరక్షణలోనూ డ్రోన్లు కీలకంగా మారాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారు, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిని గుర్తించేందుకు పోలీస్‌లు డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. బహిరంగ సభలు, వివిధ కార్యక్రమాలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసనల సమయంలోనూ వాటిని వాడుతున్నారు. వాటి వల్ల నేరస్థులను గుర్తించడం సులభమైందని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

● రెవెన్యూ శాఖ అధికారులు నిర్వహించే భూముల రీ సర్వేకు కూడా డ్రోన్లు తప్పనిసరి అయ్యాయి. వాటి ద్వారానే సర్వేయర్లు భూ సరిహద్దులను గుర్తిస్తున్నారు. భవిష్యత్‌లో తుపాన్లు, వరదలు, ఇతరత్రా విపత్తుల సమయాల్లోనూ డ్రోన్లను వినియోగించనున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు.

● అటవీశాఖ అధికారులు సైతం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో డ్రోన్ల సాయంతో విత్తనాలు జల్లుతున్నారు.



డ్రోన్ల వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)



డ్రోన్ సహాయంతో చేపట్టిన యాంటీలార్వల్ ఆపరేషన్‌ను పరిశీలిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

యాంటీ లార్వల్ ఆపరేషన్ పరిశీలన..

సీతంపేట రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో మురుగునీటి నిల్వలు ఉండే ప్రాంతాల్లో గురువారం డ్రోన్ సహాయంతో యాంటీ లార్వల్ ఆపరేషన్‌ను నిర్వహించారు. పెద్దూరు, నౌగూడ పరిసరాల్లోని పెద్ద చెరువుల్లో దోమ పిల్లలను నాశనం చేసేందుకు మలేరియా సిబ్బంది యాంటీలార్వల్ ఆపరేషన్ చేపట్టారు. ఆ ఆపరేషన్‌ను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆపరేషన్ నిర్వహణ తీరును డీఎంవో పీవీ సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు తదితరులున్నారు.

గాయత్రీదేవికి గాజులతో అలంకరణ

రాజాం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భక్తులు సమర్పించిన వందలాది రంగురంగుల గాజులతో గాయత్రీ వేదమాతను గురువారం సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వివేకానందరావు, ప్రధాన అర్చకులు వాసా జగదీశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.



గాజుల అలంకరణలో గాయత్రీదేవి

19 జలవనరులకు రూ 24.6 కోట్లతో ప్రతిపాదనలు

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 19 జలవనరులకు మరమ్మతులు చేయనున్నట్టు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంకేఎస్‌వై ఆర్‌ఆర్‌ఆర్ పథకంలో జిల్లాలోని 6,673 ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి రూ.24.6 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్టు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో అనుమతి తీసుకుని ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ స్వర్ణకుమార్, తోటపల్లి ఈఈ అప్పలనాయుడు, రెగ్యులర్ ఈఈ ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు


కూటమి ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

● అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు

రామభద్రపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. బూసాయవలస గ్రామంలో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ రాష్ట్రం కోసం సీఎం చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపడానికి పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. పేదరిక నిర్మూలకు ఈ పథకం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నారని, అలాగే తల్లికి వందనం ద్వారా ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కూడా పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిపోయిందని, కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, టీడీపీ బీసీ సంక్షేమం జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ గంట సాయి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం సమీపంలో ఏనుగుల గుంపు

కురుపాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కురుపాం సమీపంలో గురువారం రాత్రి రోడ్డుపై సంచరించడంతో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. రెండు రోజులుగా కురుపాం సమీపంలో గల సీతంపేట, బియ్యాలవలస సమీపంలో సంచరించిన ఏనుగులు కురుపాం సమీపంలో గల ఎస్‌టీఎం వద్ద నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్లే రోడ్డు పై గుంపుగా పెళ్లివలస వైపు వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.



రాత్రి రోడ్డుపై నడుస్తున్న ఏనుగుల గుంపు

జేఎస్‌ఎల్ కార్మికులకు న్యాయం చేయండి

కొత్తవలస, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లో ఉన్న జేఎస్‌ఎల్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు లెంక శ్రీను ఆధ్వర్యంలో కార్మికులు, యాజమాన్య ప్రతినిధులను, జాయింట్ లేబర్ కమిషనర్‌ను కలసి వినతిపత్రాలు అందజేశారు. ముందుగా కర్మాగారానికి వెళ్లి యాజమాన్య ప్రతినిధులు దినేష్ శర్మ, గోపాల కృష్ణను కలిశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులకే ఎప్పుడూ అన్యాయం జరుగుతోందని, లాకౌట్ ఉన్నంత కాలం లే ఆఫ్ ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా కర్మాగారంలో లాకౌట్‌ను ఎత్తి వేసి న్యాయం చేయాలని కోరారు. అనంతరం విజయనగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్‌ను కలసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈనెల 5న యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చలను నిర్వహిస్తానని హామీ ఇచ్చారని లెంక శ్రీను తెలిపారు. 7,8 తేదీలలో తానే స్వయంగా కర్మాగారానికి వస్తానని చెప్పారని వివరించారు.


జేసీఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) బక్కునాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగులు సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీట్ల భర్తీకి ఈ నెల 4న (సోమవారం) పాఠశాలలో స్పాట్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 5వ తరగతిలో 45 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 6లో 7సీట్లు, 7లో 10, 8లో 6, 9లో 19, 10వ తరగతిలో 18 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 8, రెండో సంవత్సరంలో 5 సీట్లు ఖాళీ ఉన్నట్టు తెలిపారు. వివరాలకు 9542339722, 9491331681, 9603033948 నెంబర్లలో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశాఖ-అరుకు రోడ్డులో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం గురువారం ప్రశాంతంగా ముగిసింది. తహశీల్దార్ శ్రీనువాసరావు, ఎంపీడీవో సతీష్, పంచాయతీ కార్యదర్శి అనురాధ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణదారులే అధికశాతం తమ నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ధర్నా చేస్తున్న కార్మికులు

విజయనగరం బాబామెట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామేశ్, రంగరాజులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరపాలక సంస్థ ఎదుట గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేసి 15 మంది పదవీ విరమణ పొందారని, వారి కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు, పర్మినెంట్ ఉద్యోగులకు పండుగ సెలవులు అమలు చేయాలన్నారు. కార్మికులకు పనిముట్లు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి


రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌వో

భోగాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన వారికి మెరుగైన సేవలందించాలని జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్ర సిబ్బందికి సూచించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. రికార్డులు, రిజిస్ట్రేషన్ల తీరును పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణతో వివిధ విషయాలపై చర్చించారు.

గిరిజన విద్యార్థులపై చిన్నచూపు తగదు


గిరిజన విద్యార్థులతో విజయగౌరి

మెంటాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెడ్డివానివలస గిరిజన గ్రామంలో శాశ్వత పాఠశాల భవనం ఏర్పాటులో ప్రభుత్వాల అలసత్వం క్షమార్హం కాదని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి అన్నారు. గిరిజన విద్యార్థులపై చిన్నచూపు తగదన్నారు. గురువారం ఆమె ఆ గ్రామాన్ని సందర్శించి సుమారు ఇరవయ్యేళ్లుగా ఓ ఇంటిలో నడుస్తున్న పాఠశాల దుస్థితిని స్వయంగా పరిశీలించారు. 28 మంది విద్యార్థులు బడి కావాలని అడుగుతుంటే బాధగా అనిపించిందన్నారు. విద్యార్థుల సృజనాత్మకత, విజ్ఞానం వారికి కల్పించే మౌలిక వసతులపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు శిరీష తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ గ్రామస్థులు ఆమెకు వినతిపత్రం అందజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


కిట్లను అందజేస్తున్న దృశ్యం

రాజాం రూరల్/రాజాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో గురువారం 20 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు కిరణ్ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టి పాపారావు, వసంతరావు, సభ్యులు ఆకిరి రామారావు, కొల్లా కృష్ణారావు, మక్క అప్పలనాయుడు, కిశోర్, శ్రీను, జయదేవ్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



మాట్లాడుతున్న ఆర్డీవో ఆశయ్య

గరివిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి ఆర్డీవో పి.ఆశయ్య అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత ఖైనీ, గుట్కా, గంజాయి లాంటి వాటికి అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి భవిష్యత్తు ఉండదన్నారు. తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసలతో చదివిస్తున్నారని, దానిని విద్యార్థులు గ్రహించి, మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, తహసీల్దార్ బంగార్రాజు, ఎస్ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

భోగాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి):చేపలకంచేరు, బైరెడ్డిపాలెం పంచాయతీల్లో గురువారం డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ నెల 30న 'ఆంధ్రజ్యోతి'లో 'ఎటు చూసినా మురుగు' శీర్షికన వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. డిప్యూటీ ఎంపీడీవో సమక్షంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఎస్.సాంబమూర్తిరాజు, జి.హృదయ ప్రభాకర్ పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్నదృశ్యం

విజయనగరం కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడిమాంబ ఆలయానికి గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. నగరంలోని దాసన్నపేట ప్రాంతానికి చెందిన దూసి సీతారామ ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు అందించారు. పైడిమాంబ దేవస్థానంలో నిత్యాన్నదానానికి ఈ నిధులు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా శ్రావణమాసం గురువారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

స్మార్ట్‌మీటర్లను రద్దు చేయండి


మాట్లాడుతున్న లక్ష్మి

దత్తిరాజేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కోమటిపల్లి జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బద్దలుగొట్టండని ఎన్నికల ముందు పిలుపునిచ్చారని... ఇప్పుడు వైసీపీ బాటలోనే నేతలు పయనిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డి.గౌరీష్, ఎం.గౌరినాయుడు, ఎం.సతీష్, నాగరాజు, బి.అప్పలనాయుడు, ఎల్.రాము పాల్గొన్నారు.

పోస్టాఫీసు నిర్మాణం వైపు అడుగులు


స్థలంలో కొలతలు వేస్తున్న దృశ్యం

భోగాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల కార్యాలయాల కూడలిలో పోస్టాఫీసుకు అవసరమైన స్థలాన్ని రెవెన్యూ అధికారులు గురువారం పోస్టల్ శాఖ అధికారులకు అప్పగించారు. అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం రావడంతో ఇక్కడ పోస్టాఫీసు సేవలు పెరగనున్నాయి. దానికి అనుగుణంగా భవనానిన నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 10 సెంట్ల స్థలం కేటాయిస్తున్నారు. దీని నిర్మాణానికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో స్థలాన్ని రెవెన్యూ అధికారులు గురువారం అప్పగించారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ జిల్లా సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, ఏఎస్పీ కె.సుందరనాయుడు, ఎస్పీఎం టి.వి.రమణ, సిబ్బంది సీహెచ్ సుజాత, సర్వేయర్ మధుకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై చర్చ

బైరెడ్డిపాలెంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలనపై తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు చర్చించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా బైరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను తొలగించనున్నారు. రెవెన్యూ అధికారులు స్థలం అప్పగిస్తే త్వరగా పాఠశాల భవనం నిర్మాణం చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమణమ్మ, ఎంఈవో రమణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయండి

విజయనగరం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఫ్యాపిటో చైర్మన్ బి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఫ్యాపిటో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పొజిషన్ ఐడీలు, సాంకేతిక నిబంధనలు పెట్టి రెండు నెలల జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాపిటో ప్రతినిధులు ఈశ్వరరావు, జోగారావు, సూరిబాబు, పైడిరాజు, రమణ, నగేష్, అప్పారావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'సర్టిఫికేషన్ కోర్స్' పోస్టర్ విడుదల

విజయనగరం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి సర్టిఫికేషన్ కోర్సు ఇంజనీరింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై గురువారం ఆన్‌లైన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కోఆర్డినేటర్ హేమ పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

భోగాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రల్లో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్టు సీడీపీఏ లావణ్య గురువారం తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

అన్ని రంగాల్లో రాణించాలి

రాజాం, జూలై 31, (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు పేర్కొన్నారు. రేషన్ డీలర్ల రాష్ట్ర అసోసియేషన్‌లో చోటుదక్కిన అంతకాపల్లి డీలర్ వాకముల్ల జ్యోత్స్నాదేవి, పట్టణం లోని రాణా వీధి డిపో డీలరు లలితకుమారిలను గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజాం డీలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలకు కృషి

వంగర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలని డీఐఈవో సువ్వాల తవిటినాయుడు సూచించారు. గురువారం ఆయన మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అవసరం

రేగిడి, జూలై 31, (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో నాణ్యమైన బోధన లక్ష్యం కావాలని ఎంఈవో వరప్రసాదరావు ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. లచ్చరాయపురం ఎంపీఈ పాఠశాలను గురువారం ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా సర్కారు బడులు పని చేయాలని సూచించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

భోగాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): తూడెం పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేశారంటూ అందిన ఫిర్యాదుపై డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి గురువారం విచారణ చేపట్టారు. స్థానిక సర్పంచ్ 2021-2025 మధ్య నిధులు దుర్వినియోగం చేశారంటూ రీసు రమణ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఈ ఏడాది మే 17న ఫిర్యాదు చేశారు. విచారణ నివేదికను డీపీవోకు అందజే యనున్నారు.

పరిశుభ్రంగా ఉంచండి

వేపాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో పి.బాలభాస్కరరావు ఆదేశించారు. చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాల పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఫేకర్ సమస్యలను పరిష్కరించండి

గరివిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని ఫేకర్ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. గరివిడి ప్రాంతానికి కొత్తగా పరిశ్రమలు రాకపోగా... ఉన్నవి నడవకపోవడం వల్ల నిరుద్యోగ సమస్య పెరుగుతుందన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు.

ఆటో కార్మికుల సమస్యలు..

విజయనగరం గంటస్తంభం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఆటో కార్మిక సంఘాల నాయకులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఐడీఎంఎస్ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాహన మిత్ర కిందరూ రూ.15 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర రూ.10 వేలు వేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీంతో పాటు మరికొన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

క్రైం న్యూస్

విద్యార్థుల ఆటో బోల్తా

ఆరుగురు చిన్నారులకు గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని

కొత్తవలస, జూలై 31(ఆంధ్రజ్యోతి):అర్దానపాలెం సమీపంలో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళుతున్న ఆటో గురువారం సాయంత్రం బోల్తా పడింది. పాఠశాల నుంచి పిల్లలను ఇళ్లకు తీసుకెళుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అర్దానపాలెం సమీపంలో చోటుచేసుకున్న ఈ సంఘటనలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో మంగళపాలెం, కొత్తవలసకు చెందిన డి.శిరీష, ఎల్.సౌమ్యచంద్రిక, కె.మహేంద్ర, డి.యామిని, ఎస్.ఎస్.శ్రావణ్ కుమార్ మరో విద్యార్థి గాయపడ్డారు. క్షతగాత్రులకు కొత్తవలసలో ప్రాథమిక చికిత్స చేశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థులను విశాఖపట్నం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆనంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

బండ్రసింగి ఘాట్ రోడ్డులో..


ఎల్లం (ఫైల్)

భామిని/ కురుపాం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బండ్రసింగి ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం ఆటో బోల్తా పడింది. ఘటనా స్థలంలోనే కురపాం మండలం ఆవిటికి చెందిన కొండగొర్రె ఎల్లం (60) మృతి చెందారు. ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను భామిని పీహెచ్‌సీకి తరలించారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ రాంబాబు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. బత్తిలి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు గురువారం భామిని వారపు సంతకు కురపాం మండలం ఆవిటి గ్రామానికి చెందిన ఏడుగురు ఘాట్ రోడ్డులో ఆటోలో ప్రయాణిస్తుండగా అదుపు తప్పి ఆటో బోల్తా పడి లోయలోకి దూసుకెళ్లింది. బోల్తాపడిన వెంటనే ఆటోలో ఉన్న ప్రయాణికులు చెల్లాచెదురయ్యారు. కొండగొర్రె ఎల్లం ఘటనా స్థలంలో తుదిశ్వాస విడిచాడు. క్షతగాత్రులకు భామిని పీహెచ్‌సీలో ప్రథమచికిత్స అనంతరం కొండగొర్రె గంగారావు, నాగేష్, షమంతోలకు ఐటీడీఏ అంబులెన్స్‌లో సీతంపేట తరలించారు. ఎల్లం భార్య తుని ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.


లోయలో పడిన ఆటో

రేగిడిలో..

రేగిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాగితాపల్లి మలుపువద్ద బుధవారం రాత్రి ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆటో బోల్తా పడింది. మెరకముడిదాం మండలం సిరిదేవిపేటకు చెందిన పిల్లా సన్యాసమ్మ, పిల్లా తిరుపతి, కోరాడ సీత, దేవరాజు లక్ష్మికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మెరకముడిదాం మండలం సిరిదేవిపేటకు చెందిన పిల్లా సన్యాసమ్మ, తిరుపతి మరి కొంతమంది బలిజపేట మండలం గలావల్లి నుంచి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. రేగిడి మండలం కాగితాపల్లి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న సన్యాసమ్మ, తిరుపతి, కోరాడ సీతలు తీవ్రంగా.. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో రాజాం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బంగారం చోరీపై దర్యాప్తు ముమ్మరం

వంగర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బాగెమ్మపేటలో బంగారం చోరీ చేసి..మళ్లీ వాహనంలో పెట్టిన సంగతి తెలిసిందే. దొంగలు ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఫోన్ కాల్ డేటా సేకరించామని, త్వరలో దొంగలను గుర్తిస్తామని ఎస్ఐ షేక్‌శంకర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

గజపతినగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రామన్నపేట గ్రామానికి చెందిన కొండ్రోతు సూర్యనారాయణ ఇంటి నుంచి బయటకు వెళ్లి వారం రోజులైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు గురువారం తెలిపారు. సూర్యనారాయణ ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. ఆయన కుమారుడు యోహాన్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై చైతన్యం

రాజాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగణి రాజంశాఖ అధ్వర్యంలో గురువారం అమ్మవారి కాలనీ, ఆదర్శనగర్, నవ్యానగర్ ప్రాంతవాసులకు పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో విజయగోవింద రామ ఆశ్రమం అధ్యక్షులు రమణమూర్తి, బాక్సర్ల పైడిరాజు. పెంకి చైతన్యకుమార్, వెంకట్ నాయుడు, శ్రీహరినాయుడు, జి.అప్పలనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ శిక్షణ కేంద్రం పరిశీలన

లక్కవరపుకోట, జూలై 31(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్దగల ఎంఎస్ఎంఈ శిక్షణ కేంద్రాన్ని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఎంవి.కరుణాకర్ గురువారం పరిశీలించారు. గోల్డ్ స్టార్ కూడలికి దగ్గర్లో శిక్షణ పొందుతున్న వారిని కలిశారు. 24 మంది చిరువ్యాపారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నట్లు సమన్వయకర్త డి.డానియల్ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వద్దు

విజయనగరం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లె నల్లనయ్య హెచ్చరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఉదయం పర్యటించిన ఆయన కాలువల పరిశుభ్రత, పారిశుధ్యం తీరును పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

సంకిలిలో ముమ్మరంగా పనులు

రేగిడి, జూలై 31, (ఆంధ్రజ్యోతి): సంకిలి పంచాయతీలో నీటి వనరుల పరిశుభ్రత, పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. వర్షాకాలం కావడం.. గ్రామంలో అక్కడక్కడా జ్వరాలు ప్రబలుతుండటంతో పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పట్టాభి తెలిపారు.

భూముల కొనుగోలుతో మోసపోవద్దు

ఎస్.కోట రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమ ఏర్పాటుతో తమ భూములు ఇచ్చి మోసపోయామని.. పరిశ్రమల ఏర్పాటుకు జిందాల్ వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దని బాధితులు నినాదాలు చేశారు. గురువారం మధ్యాహ్నం బొడ్డవర గ్రామం వద్ద సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో వీరు నిరసన చేపట్టారు.

ఆలస్యంగా చెల్లిస్తే అంతేనా?

(5వ పేజీ తరువాయి)

ప్రశ్నించగా.. వారు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. త్వరలో విద్యుత్ పునరుద్ధరణ జరుగుతుందని చెప్పి పంపేస్తున్నారని సదరు వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుకున్న సమయానికి చెల్లించలేక..

సీతంపేట గ్రామానికి చెందిన మరో వినియోగదారుడి నివాసానికి గతేడాది విద్యుత్‌శాఖ సిబ్బంది స్మార్ట్‌మీటర్‌ను బిగించారు. అయితే సదరు వినియోగదారుడు ప్రతినెలా విద్యుత్ బిల్లును ఆన్‌లైన్‌లోనే పేమెంట్ చేస్తున్నారు. గత రెండు నెలలుగా క్యాంప్‌లో ఉండడంతో అనుకున్న సమయానికి బిల్లు చెల్లించలేకపోయారు. దీంతో ఇటీవల ఆయన ఇంటికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సదరు వినియోగదారుడు వెంటనే తన మొబైల్ ద్వారా విద్యుత్‌బిల్లును ఆన్‌లైన్‌లో చెల్లించాడు. అయినప్పటికీ ఇంతవరకు విద్యుత్ పునరుద్ధరించలేదు. దీనిపై స్థానిక విద్యుత్ సిబ్బందిని సంప్రదించగా తామేమీ చేయలేమని, కాల్ సెంటర్‌కు సమాచారం అందిస్తామని సమాధానమిచ్చారు. దీంతో బాధితుడు ఈసురోమంటూ వెనుదిరగాల్సి వచ్చింది.

గతంలోనే వ్యతిరేకత

స్మార్ట్ మీటర్ల వినియోగంపై సీతంపేట మన్యంలో గిరిజన సంఘాల నుంచి గతంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేసేందుకే వాటిని తీసుకువచ్చారని ఆరోపించాయి. అయినప్పటికీ గత ప్రభుత్వం స్మార్ట్‌మీటర్‌ల ఏర్పాటు ప్రక్రియపై వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, కేటగిరీ-2కింద వచ్చే వ్యాపార, వాణిజ్య సముదాయాలు, సోలార్ సిస్టం వినియోగించే గృహ వినియోగదారుల ఇళ్లకు వాటిని ఏర్పాటు చేశారు. అయితే ఈ మీటర్ల వినియోగంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత సిబ్బంది విఫలమవుతున్నారు.

ట్రాన్స్‌కో డీఈఈ ఏమన్నారంటే..

స్మార్ట్‌మీటర్లు వినియోగిస్తున్న వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు మా దృష్టికి వచ్చాయి. మొత్తంగా ఎనిమిది మంది విద్యుత్ బిల్లులు ఆలస్యంగా చెల్లించడం వల్ల వారి గృహాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన దానిపై ఫిర్యాదులు వచ్చాయి. అయితే ఈ సమస్య మా పరిధిలో లేదు. స్మార్ట్‌మీటర్‌లోని సర్వర్‌కు లింక్ అవ్వని కారణంగా ఇంకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. త్వరలో సమస్య పరిష్కారమవుతుంది.' అని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ విష్ణుమూర్తి చెప్పారు.

సేవలు సరే.. మరి స్కానింగో?

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. కానీ నేటికీ ఎవర్నీ నియమించలేదు.

- పాలకొండలో ఒకటి, సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రెండు గైనకాలజిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- కురుపాం ఆసుపత్రిలో పనిచేయాల్సిన ఓ వైద్యుడు డిప్యుటేషన్‌పై పాడేరులో విధులు నిర్వహిస్తున్నారు. జీతం మాత్రం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి అందుకుంటున్నారు. అయితే కురుపాంలో రోగులకు మాత్రం ఆర్థోపెడిక్ సేవలు అందడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు

రేడియాలజిస్ట్ లేనప్పటికీ రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నాం. వైద్య సిబ్బందితో స్కానింగ్ తీసి చికిత్స అందిస్తున్నాం. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే వారికి కూడా మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం.

- నాగశివజ్యోతి, జిల్లా కేంద్రాసుపత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం

నిబంధనలు పాటించడం తప్పనిసరి

పాలకొండ, జూలై31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగ మూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని వెంకటరాయుడి కోనేరు వద్ద వాహన తనిఖీలను నిర్వహించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తప్పవన్నారు. ఈ సంద ర్భంగా సరైన పత్రాలు వాహనాలకు అపరాద రుసుం విధించారు.

ఘనంగా జైగురుదత్త హోమాలు

గరుగుబిల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం జైగురుదత్త హోమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, తదితర పూజా కార్యక్రమాలతో పాటు విశేష అర్చనలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన యజ్ఞ, యాగకర్త, ఎస్‌వీ ఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో శీఅనగాదేవి సహిత జైగురుదత్త హోమాలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట రూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి): సీతంపేట సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం సీతంపేట మండలంలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఈఈ విష్ణుమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు వి ద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యాపారవేత్తగా ఎదగాలి

బెలగాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ వ్యాపారవేత్తగా ఎదగాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో సీడాప్, సెంచూరియన్ యూనివర్శిటీ వారి ఆధ్వర్యంలో నిపుణలతో పలు రకాల వ్యాపారాలు కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనిల్ పలు వ్యాపారాలపై శిక్షణ గురించి వివరించారు. మష్రూమ్, కోళ్ళ, గొర్రెల పెంపకం, డ్రాగాన్ ఫ్రూట్స్ పంట తదితర పంటల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి బ్రాంచ్ కార్యదర్శిగా శ్రీనివాస్

బెలగాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్ట్ శ్రామిక రెండో వార్షిక జనరల్ బాడీ మీటింగ్ బొబ్బిలిలో గురువారం జరిగింది. బొబ్బిలి బ్రాంచ్ కార్యదర్శిగా పార్వతీపురం రైల్వే స్టేషన్‌మాస్టర్ పోల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సెంట్రల్ ఆఫీస్ బేరర్ ఈశ్వరరావు హాజరయ్యారు. రైల్వే శ్రామిక కాంగ్రెస్ కార్మిక సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి తీరువా బకాయిలపై వడ్డీమాఫీ

బొబ్బిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంలో రైతుల నుంచి రావాల్సిన నీటి తీరువా బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో 262ను జారీ చేసింది. 2024-25 సంవత్స రానికి రైతుల నుంచి రూ.85.81 కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉంది. దీనిపై వడ్డీని ప్రభుత్వం తాజాగా మాఫీ చేస్తూ రైతులకు వెసులు బాటు కల్పించింది. గురువారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.విజయలక్ష్మి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

కొంగొత్తగా గాంధీ పార్కు

●మున్సిపాలిటీ, దాతల సహకారంతో అభివృద్ధి ●పట్టణ వాసుల్లో హర్షం

సాలూరు, జూలై31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన గాంధీ పార్కు కొంగొత్త అందాలను సంతరించుకుంది. ఇక్కడి పార్కు నిర్వహణను ఎన్నో ఏళ్లుగా యంత్రాంగం గాలికి వదిలేసింది. దాంతో పార్కు అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. దుర్గంధం వెదజల్లుతుండంతో పార్కులోకి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉండేది. అలాంటి పార్కును అభివృద్ధి చేసి పట్టణవాసులకు ఆహ్లాదం అందించాలని మున్సిపల్ యంత్రాంగం భావించింది. కొద్దిపాటి మున్సిపాలిటీ నిధులు, దాతల సహకారంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. అధ్వానంగా ఉన్న వాటర్ ఫౌంటెయిన్‌ను పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు. గాంధీ విగ్రహానికి రంగులు వేయించారు. చెట్లను సుందరంగా మలిచారు. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



వాటర్ ఫౌంటెయిన్

దాతలు సహకరిస్తే మరింత అభివృద్ధి..

సాలూరు మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయ వనరులు చాలా తక్కువ. సాలూరులో ఉన్న అత్యంత చరిత్ర కలిగిన గాంధీ పార్కు, అందులోని వీరహనుమాన్ వ్యాయామశాల, గ్రంథాలయం అభివృద్ధి చేసేందుకు దాతలు సహకరించాలి.

-ప్రసాద్, కమిషనర్, సాలూరు మున్సిపాలిటీ



పార్కులోపల గాంధీ విగ్రహం

ప్రజలు తిరస్కరించినా బుద్ధిరాలేదు: మంత్రి



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ రూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తిరిస్కరించినా వైసీపీ నాయకులకు బుద్ధిరాలేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం డి.సిర్లాంలో మండల పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణుగోలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట భైరిపురం పీఏసీఎస్ అధ్యక్షుడు దాకేటి గౌరునాయుడు ఆధ్వర్యంలో స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన మంచిని వివరించారు. అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే అభివృద్ధిని పరుగులు పెట్టించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందంటూ ఇంటింటికి వచ్చి వైసీపీ నాయకులు నమ్మించాలని చూస్తున్నా రన్నారు. అలాంటి ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు తెలుసుకని వాటి పరిష్కారానికి ఆమె హామీ ఇచ్చారు. సిర్లాంలో రోడ్లు, కాలువలు, మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌన్సిల్ నుంచి చైర్‌పర్సన్ వాకౌట్

●ఆమె తీరు ఆక్షేపణీయం: ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం/ పార్వతీపురం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సభలో వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పదవికి ఆమె కళంకం తీసుకువచ్చారని అన్నారు. గురువారం పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అయితే సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే చైర్‌పర్సన్ తన కుటుంబ సభ్యులకు నైట్ షెల్టర్ కావాలని స్వయంగా ఆమె ఆదేశాలు జారీ చేయడంపై సభ్యులు అభ్యంతరం తెలిపారు. దాంతో సభ నుంచి ఆమె వాకౌట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ సమావేశానికి అధ్యక్షత వహించి అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాల్సిన చైర్‌పర్సన్ సభ నుంచి వాకౌట్ చేయడం విచారకరమన్నారు. సభా నియమాలకు వ్యతిరేకమని విమర్శించారు. గతంలో కూడా ఆమె పలుమార్లు వాకౌట్ చేసి ప్రజలలో నమ్మకాన్ని పోగొట్టుకున్నారన్నారు. ఇలాంటి చైర్‌పర్సన్ ఉండటం పార్వతీపురం ప్రజల దురదృష్టకరమన్నారు. ఇకనైనా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరినాయుడు, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లపై దాడులు



మందుల దుకాణంలో అధికారుల తనిఖీలు

కొమరాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండానే కొమరాడలో పలువురు ఆర్ఎంపీ, పీఎంపీలు క్లినిక్‌లు నిర్వహిస్తుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లు, మందుల దుకాణాలపై కొమరాడ డాక్టర్ అరుణ్‌కుమార్ నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ పకీబు, ఏఎస్ఐ రామారావునాయుడు, విజయ్ దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండానే మందులు విక్రయించడం, ఇంజక్షన్స్, సెలైన్ బాటిల్స్ పెడుతున్నట్టు గుర్తించారు.

●సీతానగరం: మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, మందుల షాపులను డిప్యూటీ తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, వైద్యాధికారి పి.ఉషారాణి గురువారం తనిఖీ చేశారు. అనుమతి లేకుండా క్లినిక్‌లు ఏర్పాటు చేసి పొంతన లేని మందులు, సెలైన్‌లు ఎక్కించడం నేరమన్నారు. ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తే వారిని గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లపై గురువారం అధికారులు దాడులు నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం లోని పలు క్లినిక్‌లను తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి అభిలాష్, ఎస్ఐ శివప్రసాద్ క్లినిక్‌లను తనిఖీ చేశారు.

●పాచిపెంట: ప్రజల ప్రాణాలు, ఆర్థిక ఇబ్బందులకు గురిచేసే అనధికార వైద్యులపై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు దాడులు చేపట్టారు. కమిటీలో చైర్మన్‌గా తహసీల్దార్, సభ్యులుగా స్థానిక ఎస్ఐ, వైద్యాధికారి వ్యవహరించారు.

●గరుగుబిల్లి: మండలంలోని మందుల షాపులు, ప్రైవేట్ క్లినిక్‌లను గురువారం వైద్య, రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీ చేశారు. తహసీల్దార్ పి.బాల, పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుమల ప్రసాద్, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

భామిని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భామినిలోని అంబేద్కర్ బాలి కల గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆ హ్వాని స్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.విజయనిర్మల ఒక ప్రకటనలో తెలి పారు. 5, 6, 7, 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ హెచ్ ఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీలగా ఉన్నాయన్నారు. వివరాలకు 8985401216, 7702347235 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆశాల సమస్యల పరిష్కారానికి చర్యలు



వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో

పార్వతీపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆశాల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవో హోంలో ఆశాల గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమం డీఎంహెచ్‌వోకు ఎస్.భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ప్రతి పీహెచ్‌సీ నుంచి ఒక ఆశ కార్యకర్త ప్రతినిధిగా హాజరయ్యారు. వారి సమస్యలను గ్రీవెన్స్‌లో ప్రస్తావించి ఫిర్యాదులను డీఎంహెచ్‌వోకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, డాక్టర్ కౌశిక్, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, డీసీఎం విజయలత, హెచ్ఈ విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు ఇవ్వడం సరికాదు

సాలూరు రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1గా ప్రభు త్వ పాఠశాలలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లకు ఇవ్వడం సరి కాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు జాగాన రామునాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాలి చంద్రశేఖర్ ఆక్షేపిం చారు. గురువారం వారు ప్రకటన విడుదల చేశారు. ప్రభు త్వ యాజమాన్య పాఠశాల సహాయకులకు ఎంఈవో-1 పోస్టులివ్వ డం జడ్పీ ప్రధానోపాధ్యాయులకు అన్యాయం చేయడమేనన్నారు. ఉ మ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు ఇది విఘాతమన్నారు. ఈ విధా నానికి ఆపస్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోందన్నారు. గురువారం పలు పాచిపెంట తదితర పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఆపస్ నేతలు సాదాపు శ్రీనివాసరావు తదితరులు నిరసన వ్యక్తం చేశా రన్నారు. ఆగస్టు 1న జడ్పీ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరిం చి విధులకు హాజరుకావాలన్నారు. ప్రభుత్వ నిర్ణయంలో మార్పు రాకుంటే ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతామన్నారు.


తనిఖీలపై నిర్లక్ష్యం వద్దు



రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఆర్‌పీ

గరుగుబిల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సామాజిక తనిఖీలపై సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని ఎస్ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులకు తనిఖీలు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరుగుబిల్లి మండలానికి సంబంధించి 2024-25 సంవత్సరం మార్చి వరకు చేపట్టిన పనులను పరిశీలన చేస్తారన్నారు. 19వ సామాజిక తనిఖీల్లో 25 పంచాయతీలకు సంబంధించి వేతనదారులకు రూ. 16.53 కోట్లు, అలాగే మెటీరియల్‌కు సంబంధించి రూ. 3.54 కోట్లు వ్యయం చేశారన్నారు. పంచాయతీరాజ్, ఐఎఫ్‌డీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారులతో పాటు పలు పనులు పరిశీలన జరుగుతుందన్నారు. మొత్తంపై సుమారు రూ. 20 కోట్లుకు పైగా ఉపాధి నిధులు వెచ్చించారన్నారు. ఆగస్టు 1 నుంచి పంచాయతీల పరిధిలో తనిఖీలు అనంతరం గ్రామసభలను నిర్వహిస్తామన్నారు. తదుపరి మండల కేంద్రంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజావేదిక ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలన్నారు. సిబ్బంది తప్పిదాలకు అనుకూలంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా 'బూరాడ'



మాట్లాడుతున్న చిరంజీవులు

సీతానగరం, జూలై31 (ఆంధ్రజ్యోతి): గుచ్చిమి పీఏసీఎస్ అధ్యక్షుడిగా బూరాడ చిరంజీవులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భం గా చిరంజీవులు మాట్లాడుతూ పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. రైతులకు అన్ని విధాలుగా తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. పీఏసీఎస్ ద్వారా వ్యవసాయ రుణాలు అందిస్తామన్నారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా సంజీవినాయుడు, బొమ్మినాయని లక్ష్మణరావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని తెరిపించండి

సీతానగరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని సంబంధిత అధికారులు, యాజమాన్యానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సూచించారు. చాలా కాలంగా మూతబడి ఉన్న షుగర్ ఫ్యాక్టరీని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు గురువారం పరిశీలించారు. సుగర్ ఫ్యాక్టరీ స్థితిగతులు, ఉద్యోగుల సంఖ్య, ఆర్థిక వనరులు, ముడి సరుకు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ ఎన్‌సీఎస్ షుగర్ ఫ్యాక్టరీ మూతపడటంతో చాలామంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. గతంలో ఎన్‌సీఎస్ షుగర్ ఫ్యాక్టరీ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని, అప్పట్లో దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంతో కంపెనీ దివాలా తీసిందన్నారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా ఉద్యోగులకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. ఫ్యాక్టరీ ని త్వరగా తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు మరణించిన కార్మి కుల కుటుంబాలకు ఆర్థికసాయం చేయాలని యాజమాన్యాన్ని ఎమ్మెల్యే కోరారు.

మెప్మా పాత్ర కీలకం

బెలగాం/పార్వతీపురం టౌన్, జూలై31 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతంలో పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడంలో మెప్మా ఆర్పీలు కీలకపాత్ర పోషిం చాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన మెప్మా కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభిం చారు. అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడి సంస్థ కార్యక లాపాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పేదలకు సహాయ సహకారాలు అందించడంలో మెప్మా కీలకంగా ఉండాలని సూచించారు. ఆర్పీలు ప్రభుత్వంలో భాగస్వాములని, బాధ్యాయుతంగా వ్యవహరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు జీవీసీ రాజు, టీడీపీ నాయకులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చివేత



గండిని పూడుస్తున్న దృశ్యం

మక్కువ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని తూరుమామిడి పనులకు చెరువుకు పడిన గండిని గురువారం రైతులు పూడ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో రైతులు సొంత నిధులు వెచ్చించి గండిని పూడ్చుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెబుతోందన్నారు. 150 ఎకరాలకు సాగునీరు అందించే పనుకు చెరువుకు గండిపడి సుమారు 20 రోజులు అవుతున్నా గండిని పూడ్చకపోవడం దారుణమన్నారు. ఇరిగేషన్ అధికారులను గండిని పూడ్చాలని కోరిన పట్టించుకోలేదన్నారు. దీంతో రైతులు శ్రమదానంతో గండి పూడ్చారన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

20 మందిపై బైండోవర్

సీతంపేట రూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండలంలో సారా ప్రభావిత గ్రామాల్లో గతంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన 20 మంది ముద్దాయిలు, అను మానితులపై గురువారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ అమ్మ నరావు తెలిపారు. ఒక్కొక్కరికి రూ2 లక్షల చొప్పున పూచీకత్తుపై తహ సీల్దార్ బైండోవర్ చేశారన్నారు. బైండోవర్ చేసిన వారు ఇకపై సారా వంటకాలు, విక్ర యాలు, రవాణా చేస్తూ దొరికితే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

పాచిపెంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోనవలస వద్ద బుధ వారం రాత్రి పశ్చిమ బెంగాల్‌కు చెందిన అశిష్ పండిట్ గంజాయితో పటుబడ్డారు. అతడి నుంచి 3.330 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టు సమీపంలో గల దుర్గాదేవి గుడి వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తున్నారడనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశామన్నారు. ఒడిశా ప్రాంతం మల్కనగిరి నుంచి చెన్నైకు గంజాయిని తరలి స్తుండగా పట్టుబడినట్టు ఎస్ఐ కె.వెంకట సురేష్ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

పాలకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెం పొందించుకుని సమాజంలో బాధ్యతగా మెలగాలని యువతకు ఎస్ఐ ప్రయోగ మూర్తి పిలుపునిచ్చారు. గురువారం నేషనల్ సివిల్‌డే సందర్భంగా స్థానిక పోస్టాఫీస్ రోడ్డు జంక్షన్‌లో యువతకు చట్టాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కారణంగా మనిషి మతిస్థిమితం కోల్పోయి తప్పులు చేసే ప్రమాదం ఉందన్నారు. ఎవరినీ కులం పేరుతో దూషించరాదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొండదాడి రాజేష్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ ప్రతినిధి ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొఠియాలో కోరాపుట్ కలెక్టర్ సుడిగాలి పర్యటన



కొఠియా గ్రామాలకు వెళ్తున్న కోరాపుట్ కలెక్టర్

సాలూరు రూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మనోజ్ సత్యవాన్ మహాజన్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. కొఠియా గ్రూప్ గ్రామాలైన మూల తాడివలసలో సుభాస్ చంద్రబోస్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. నేరేళ్లవలస, ఎగువశెంబి, కొఠియా, ఎగువ మెండంగి, ముడకారు, పట్టుచెన్నారు తదితర గ్రామాల్లో పర్యటించారు. కొఠియా గ్రూప్ అభివృద్ధి తదితర విషయాలపై జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కోరాపుట్ కలెక్టర్ కొఠియా గ్రూప్ గ్రామాల్లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.